
రమేష్ కులకర్ణికి ఆ వూరు ఎంతో నచ్చింది. ఇంతవరకు పనిచేసిన వూర్లకన్న ఈ వూరు ఎంతో భిన్నంగా వుంది. కొండజాతి వారి మధ్య పనిచేస్తున్న తృప్తి గతంలో ఎప్పుడూ కలగలేదు. వారిస్తున్న ఆదరణ, గౌరవమర్యాదలు కులకర్ణికి తన సర్వీసులో ఇంతవరకూ లభించలేదు. వారి ప్రేమా ఆప్యాయతలూ స్వచ్ఛ అడవి తేనెలా వున్నాయి.

తనకారోజు బాగా గుర్తుంది. కులకర్ణి ఆ వూరు చేరుకున్న రోజు. వూరి పెద్దలతోనే కాక ప్రతి ఒక్కరితో పరిచయం చేసుకొని మనస్పుతో మాట్లాడాడు. తమ పిల్లలకు చదువు చెప్పే పంతులని తెలిసి అందరూ మురిసిపోయారు.

# ఫోటో

డా॥ టి. సంపత్ కుమార్.



పంతులంటే పిల్లా జెల్లకు భక్తితో కూడిన గౌరవం. పెద్దలకు మంచి మిత్రుడేకాక సలహాదారుడు కూడ. అమ్మలక్కలకు తోబుట్టువు. తక్కువ కాలంలోనే కులకర్ణి తలలో నాల్కలా, విశిష్టమైన వ్యక్తిగా అందరి హృదయాల్లో చోటు చేసుకున్నాడు.

కులకర్ణికి ఫోటోగ్రఫీ అంటె చాలా ఇష్టం. చిన్నప్పటి నుండి కెమేరా చేత పట్టుకొని కొత్త ప్రదేశాలు తిరగాలని, తన మూడో కన్నులో కల్లోలం సృష్టిస్తున్న సబ్జెక్లను ఎంతో నేర్పుగా క్యాప్చర్ చేయాలన్న జ్వాల కదలాడుతూ వుండేది. ఆసక్తితో ఫోటోగ్రఫీపై ఎన్నో పుస్తకాలు చదివాడు.

అడవి ఒళ్ళోకి చేరుకున్న కులకర్ణికి వూర్లో, వూరి పరిసరాల్లో మంచి సబ్జెక్ట్స్, కంపోజిషన్స్ దొరికేవి. వివిధ పత్రికల్లో తాను తీసిన ఫోటోలు ప్రింటవడం మొదలైంది. ప్రింట్లు వచ్చాక వూరి వారందరికీ చూపించేవాడు. వాళ్ళ ఆశ్చర్య సంభ్రమాల్లో తానూ ఒకడయ్యేవాడు.

గ్రామీణ ప్రాంతాల్లో చచ్చిపోయినవారి ఫోటోలను తీస్తుంటారు. ముఖ్యంగా పోయినవారి ఫోటో ఇంట్లో లేకపోతే మరీ తీసి ఇంట్లో వుంచడం ఓ రీతిగా మారింది. కొన్నిచోట్ల శవాన్ని కుర్చీపై కూచోబెట్టి ఒంటరిగానో ... లేక చనిపోయినవారి కుటుంబసభ్యులతో గ్రూప్ ఫోటోనో ... ఒక్కోసారి పాడెపై పడుకోబెట్టాకనో ... తీస్తుంటారు.

** ** ** ఆ రోజు పక్క వూరినుండి భీమ్లా గబగబా పరుగెత్తుకుంటూ వచ్చాడు. కులకర్ణి వద్ద కెమేరా వుందని దౌడు తీశాడు. చేరుకున్నాడే కాని మాట్లాడే స్థితిలో లేక దమ్ము తీసుకుంటున్నాడు. గుండె లబ్‌డబ్‌ల నేపథ్యం లీలగా ఓ స్థాయికి చేరాక రొప్పకొస్తున్న మాటల్ని బయటకూదాడు.

"అయ్యా! మా పెద్దయ్య సచ్చిపోయిండు. మీరొచ్చి ఫోటో దియ్యాల. ఎత్క పోయేందుకు తయారుజేస్తుండ్రు. బిరాన నడుండ్రి" అన్నాడు రొప్పతూనే.

కులకర్ణికి ఏం చెప్పాలో తోచడం లేదు. కెమేరా ఖాళీగా వుంది. రీల్లేదు. యాభై కిలోమీటర్ల దూరంలో వున్న టౌన్‌కెలితేగాని రీలు చిక్కదు. భీమ్లా పనిగట్టుకొని రావడం, తనవద్ద రీల్లేకపోవడం కులకర్ణి మనస్పును పిండేస్తూంది. ఎన్నోసార్లనుకున్నాడు రీలొకటి స్పేర్‌లో వుంచుకోవాలని. ఓ వైపు కులకర్ణి మథనపడుతుంటే మరోవైపు భీమ్లా ముఖంలో "ఆలస్యమవుతూంది. తొందరగా నడుద్దాం" అన్న కవళికలు ప్రస్ఫుటంగా కనబదుతున్నాయి. రీల్లేకపోతే ఫోటో తీయలేరన్న సంగతి భీమ్లాకు చెప్పినా అర్థం కాలేదు. అతని కర్థం కాదని కులకర్ణికీ అర్థమయింది. భీమ్లాని తృప్తి పరచేందుకు కులకర్ణి అతనితో వెళ్ళి కెమెరాని శవంవైపు తిప్పి ఊరికే 'క్లిక్' మనిపించాడు.

ఆ విధంగా భీమ్లానైతే సంతోషపరిచాడు కానీ లోలోపల మోసగించినట్టు ఫీలవుతూనే వున్నాడు.

** ** **

ఆ ఉదయం కులకర్ణి పుస్తకంలో తలదూర్చి సీరియస్‌గా చదువుకుంటున్నాడు. ట్రాన్సిస్టర్లో వార్తలొస్తున్నాయి. పిల్లగాలికి చెట్లు ఆకులు మృదువుగా కదులుతున్నాయి. ఎక్కడినుండో నెమలొకటి వచ్చి చెట్టుపైన వాలింది.

భీమ్లా మెల్లగా అడుగులేసుకుంటూ వచ్చి ఇంటిముందు వినయంగా కూర్చున్నాడు.

"ఏం భీమ్లా – ఇటొచ్చినవ్? అంత మంచిదేనా?"

"దండాలయ్య. తమరి దగ్గరికె అచ్చిన. మా పెద్దయ్య పోయి నెలరోజులైంది గదా. పోటో తీస్కపోదమని అచ్చిన" చేతులు జోడించి విన్నవించాడు భీమ్లా.

ఆ రోజు కెమేరాను క్లిక్కు మనిపించడంతో ఆ ఘట్టం అక్కడికే ముగిసిపోతుందేమో ననుకుంటే అదింకా సజీవంగా ముందుకు సాగడంతో కొద్దిగ

చిరాకు మాత్రం కలిగినట్లనిపించింది. రీలు లేకుండా ఫోటో రాదన్న విషయమే కాదు, మరింకెన్నో సంగతుల గురించి సరయిన అవగాహన లేక అమాయక జీవనం గడుపుతున్న కొండజాతి ప్రజల స్థితిగతులు కులకర్ణి గుండెను తూట్లు పొడుస్తున్నాయి. తప్పు వాళ్ళది కాదని సమాధానపరచుకున్నాడు.

"అయ్యా! మీరు పోటు ఇప్పిస్తే నెనెళ్ళిపోతనయ్య. అందరు చూసేందుకు మక్కువ జూపుతున్నరు. "

"ఇంకా తయారుగాలేదు. గొన్ని రోజులాగు. ఫోటో కోసం పట్నం బోవాల. ఇంతట్ల పాయేదుంది. అపుడు దెస్త" నరాలు లేని నాల్కనుండి వచ్చినట్లున్నాయా మాటలు. భీమ్లా అక్కడే ఉంటే ఇంకా ఏం మాటలు జారిపడతాయేమో నని కంగారు పుట్టింది. తొందరగా వెళ్ళిపోతే బాగుండునని మనసులో కోరుకుంటున్నాడు.

ఫోటో చూస్తానన్న ఆతురతలో వచ్చిన భీమ్లా నిరాశతో పోవడానికి మన స్సెందుకో అంగీకరించడం లేదు. తనకు తెలుసు, వట్టి చేతుల్తో వెల్తే నిరుత్సాహపడేవారు ఇంటిదగ్గర వున్నారని. అయినా తాను దీంట్లో చేసేదేం లేదుకదా అని సంజాయిషీ చెప్పకుని "మంచిదయ్యా! మల్లొచ్చి కలుసుకుంట" అంటూ చేతులు జోడించి కింద దించుకున్న ముల్లెను తలపై కెక్కించి ఊరివైపు దారి తీశాడు.

వెళ్తున్న భీమ్లాను చూస్తుంటే తన గుండె మీదుగా నడుస్తున్నట్టుంది కుల కర్ణికి. భీమ్లా మళ్ళీ వచ్చే సమయం ముంచుకొస్తున్నట్టనిపించింది. భీమ్లా వదిలిపోయింది ఇప్పడే అయినా మళ్ళీ అదే చోటికి ఫోటోకోసం వచ్చి కూచు న్నట్టు భ్రమ కలుగుతోంది.

** ** **

ఎదురుపడిన భీమ్లాని తనే పలకరిస్తూ "ఇంటికి నడు. ఫోటో తీస్కపోదువుగాని" అన్నాడు కులకర్ణి. ఈ మాటలంటూంటే కులకర్ణి పెదిమలు కొద్దిగా వణికాయి. వెంట వస్తున్న భీమ్లాను యోగక్షేమాలడుగుతూ ఇంటికి చేరాడు కులకర్ణి. పుస్తకంలో భద్రంగా దాచిన ఓ కవర్‌ను మెల్లగా తీసి ఫోటోను బయటకు తీసి క్షుణ్ణంగా పరిశీలించి మళ్ళీ కవర్లోకి తీసి భీమ్లా చేతికందించాడు. కవరందుకున్నప్పడు భీమ్లా పెదిమలపై అమాయకపు చిరునవ్వొకటి మజిలీ చేసుకుంది.

"భీమ్లా! ఎట్లున్నది ఫోటో? మంచిగచ్చిందా?" అడిగాడు కులకర్ణి.


"ఆ! మంచిగనె కనవడుతున్నదయ్యో దీనికి అద్దం గట్టిపిస్త" ఉత్సాహంతో బదులిచ్చాడు భీమ్లా. ఎప్పుడెపుడు వెళ్ళి ఇంట్లో అందరికి చూయించాలన్న కోరిక తరుముకొస్తుంది భీమ్లాలో.

"దీన్ని మల్పకు. ఇట్లనే నలుగకుండ పదిలంక పట్కపో" అని జాగ్రత్తలు చెప్పాడు. భీమ్లా కవర్‌నందుకొని "మంచిదయ్య. నడుస్త" అని వెనక్కి తిరిగాడు.

** ** **

"అయ్య! ... అయ్య!!" భీమ్లా పిలుస్తుంటే వెనక్కు తిరిగి చూశాడు ఏదో పనిమీద ఆ వూరొచ్చిన కులకర్ణి.

"దండాలయ్య. ఎటో అచ్చింద్రు. కొద్దిగసేపు మా ఇంట్ల కూసుండిపోండ్రి ... సల్లవడ్డాక పోదురుగాని ... ఎండగొడుతుంది" అంటూ తత్తరపాటు పెల్లుబకగా, గౌరవ మర్యాదలు పోటీలు పడుతుంటే ఆప్యాయతతో కులకర్ణిని ఆహ్వానించాడు. చిరునవ్వుతో "మంచిది, నడు" అంటూ భీమ్లా ననుసరించాడు.




కులకర్ణి రాకతో ఇంట్లో అందరికీ పండగొచ్చింది. చచ్చిపోయిన తమ పెద్దయ్య ఫోటో తీసింది అతనేనని ఆ ఇంట్లో చైతన్యం వచ్చింది. కులకర్ణి అందరితో ఆప్యాయంగా మాట్లాడాడు. భీమ్లా ఇచ్చిన చల్లని మంచినీళ్ళు తాగాడు.

ఫోటోకు రోజూ పూజలు చేస్తున్న నిదర్శనాలున్నాయి. ఎండిపోయిన పూల మాలలు ఫోటోకు ఊగుతున్నాయి. అగరొత్తుల చిరువేడితో, పొగతో అద్దం కొంచెం డిమ్‌గా వుంది.

"దీన్ని రోజూ సూసుకొని మా పెద్దయ్యను యాదికి జేసుకుంటమయ్య" అంటూ తమ మధ్య ఇంకా తాను జీవించి ఉన్నాడన్నంత సంతోషంగా చెప్పాడు భీమ్లా.

కాస్త తేరుకొని మామూలు మనిషయ్యేందుకు ప్రయత్నించాడు కులకర్ణి. మళ్ళీ ఓ చెంబుడు నీళ్ళు అడగాలనిపించింది. ఇక అక్కడ ఒక్క క్షణం కూడ ఉండబుద్ధికాలేదు. "మంచిది. నేన్నడుస్త" అని ఫోటోను భీమ్లా చేతికందించి బయటకు అడుగులేశాడు కులకర్ణి. ఇంటికెళ్ళి రూమ్‌లో పడుకున్న కులకర్ణికి తను చేసిన పని 'రీల్'లా కళ్ళముందు తిరుగుతోంది.

పక్క టౌన్లో తనకు తెలిసిన స్టూడియో అతను, ఆ ప్రాంతంలో ఎందరివో చనిపోయిన వాళ్ళ ఫోటోలు తీశాడు. తన వద్దున్న నెగెటివ్‌లలో కొన్నింటిని కుల కర్ణి ముందుంచాడు. బాగా పరిశీలించి, ఆనాటి ఫోటోకు దగ్గరి పోలికలున్న నెగెటివ్ నొకదాన్ని తీసి స్టూడియో అతనితో చర్చించి ప్రింట్‌కు ఆర్డరిచ్చాడు. ప్రింటొచ్చాక స్టూడియో అతను కులకర్ణి సూచనల ప్రకారంగా బ్రష్‌తో పేపర్ స్ట్రిప్ రంగులు దిద్దాడు.

డబ్బులు చెల్లించి, స్టూడియో అతనికి మరోసారి థాంక్స్ తెలిపి ఫోటో నలగకుండా వెంబడి తెచ్చుకున్న పుస్తకంలో వుంచాడు. ఆ విధంగా భీమ్లా సమస్య పరిష్కారమయిందనుకున్నాడు కానీ వాళ్ళ ముక్కూ మొఖం తెలియని ఎవరి ఫొటోనో తనవారిదని పూజించడం కులకర్ణికి బాధ కలిగిస్తోంది. ఇదే అతన్ని కుంగదీసింది. తాను భోళా మనుషులతో ఆడుకోలేదు గదా అన్న ప్రశ్నే తొలుస్తూంది. ఎంత సంజాయిషీ చెప్పకుందామనుకున్నా అంతరంగం ఘోరాపరాధం చేశావని నిలదీసి అడుగుతోంది. ఆలోచనల ఘర్షణలతో తలలో వేడి పుట్టింది. కొయ్యకు వేలాడుతున్న కెమేరా తనను వెక్కిరిస్తూంది.

కెమేరా వైపు మరోసారి చూశాడు. ఇపుడది తననే ఫొటో తీయడానికి రెడీగా వుంది. ఫోకస్ కోసం లెన్స్ తనంతట తానే ముందుకు..... వెనక్కు ...... జరుగుతూంది. కులకర్ణి చేతుల్తో ముఖం కప్పకుంటూ "వద్దు....వద్దు...... నన్ను ఫొటో తియ్యొద్దు" అంటూ అరుస్తూ కుర్చీలోంచి ఒక్క దూకున కెమేరా స్ట్రాప్‌ను దొరికించుకుని బయటకు పరిగెత్తాడు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్ట్రాప్‌తో కెమేరాను ఆకాశంలోకి మెరుపులా లేపాడు.

చెట్టుపైకి అప్పడే చేరిన పక్షులు ఒక్కసారే జడుసుకొని పైకెగిరాయి.

■■■